సంపాదకీయం

# మా అవగాహన - ఆచరణ

మానవ హక్కుల వేదిక ఏర్పడి ఒక సంవత్సరం గడిచింది. ఈ సందర్భంగా మా దృక్కోణాన్ని ఆచరణనూ వివరించే ఈ బులెటిన్‌ను ప్రచురిస్తున్నాము.

హక్కుల ఉద్యమానికి తనదంటూ ఒక కార్యరంగం, ఒక దృక్పథం అవసరమని మేము భావిస్తున్నాం. నూతన సమాజాన్ని నిర్మించే లక్ష్యంతో ముందుకొచ్చే రాజకీయ, సామాజిక ఉద్యమాల మధ్యనున్న నువ్వా నేనా అన్న పోటీలో హక్కుల ఉద్యమం భాగం కానక్కర లేదు. కేవలం వ్యూహాత్మకంగా సమదూరం, సమభావం పాటించడం కాదు. సిద్ధాంతరీత్యానే అన్ని 'విముక్తి' పోరాటాలతోనూ సిద్ధాంతాలతోనూ ఒకే రకమైన సంబంధం పెట్టుకోవడం హక్కుల ఉద్యమానికి అవసరమేకాక తగినది కూడా.

ప్రతి రాజకీయ, సాంఘిక ఉద్యమ సిద్ధాంతంలోనూ కొన్ని సాధారణ ప్రజాస్వామిక సూత్రీకరణలతోపాటు ఒక ప్రత్యేక సిద్ధాంత కోణం కూడా ఉంటుంది. ఆ ప్రత్యేక సిద్ధాంతకోణాల మధ్య పోటీ, సంవాదం ఉంటుంది. వాటి నుండి హక్కుల ఉద్యమం నేర్చుకునేదేమీ లేదని కాదు. నేర్చుకునేదీ ఉంటుంది, తన దృక్కోణం నుండి విమర్శించేదీ ఉంటుంది. కానీ హక్కుల ఉద్యమ దృక్పథం ప్రధానంగా అన్ని ప్రజా ఉద్యమాలలోని ప్రజాతంత్ర ఆకాంక్షల సమాహారంగా రూపం తీసుకుంటుంది. ఇక్కడ ఉద్యమాలు అన్నప్పుడు సంఘటిత ఉద్యమాలే ననుకోనక్కరలేదు. సంఘటితరూపం తీసుకోలేక ఆకాంక్షగానో ఆరాటంగానో ఉండిపోయే నిరసన కూడా కావచ్చు. అదీ 'ఉద్యమాలు' అన్నదానిలో భాగమే. ఈ ఉద్యమాలు ప్రతిపాదించే ప్రజాస్వామిక సూత్రీకరణల నన్నిటి నీ వీలయినమేరకు ఇముడ్చుకునే సిద్ధాంత దృక్పథాన్ని హక్కుల ఉద్యమం అభివృద్ధి చేసుకోవాలి. ఇది స్వభావరీత్యానే విశాల దృక్పథం కాబట్టి ఇతర ఉద్యమాలకు కూడా విశాల దృక్పథాన్ని హక్కుల ఉద్యమం నేర్పించగలుగుతుంది.

ఒక్కొక్క ప్రజాఉద్యమం ఏదో ఒక ప్రజాసమూహానికీ వారి అవసరాలకూ కేంద్రస్థానం ఇస్తుంది. లేదా సామాజిక ప్రగతిలోని ఏదో ఒక సమస్యకూ దాని పరిష్కారానికీ ప్రాధాన్యం ఇస్తుంది. కాని హక్కుల ఉద్యమం ప్రాధాన్యతల ఎంపిక జోలికి పోనక్కర లేదు. హక్కులలేమిని అనుభవించే ప్రజలందరినీ ఒప్పించగల ప్రాధాన్యతాక్రమం ఏదీ ఉండదు.

దానిబదులు ఒక్కొక్క జీవిత పోరాటంలోనూ ఒక్కొక్క జీవిత సమస్యలోనూ ఉన్న అణచివేతనూ ఆరాటాన్నీ ఆకాంక్షలనూ సమాజానికి వివరించడం, ఆ ప్రజలకు అండగా నిలబడడం, ఆ పోరాటం నుండీ ఆకాంక్షల నుండీ పుట్టే ప్రజాస్వామిక విలువలనూ హక్కులనూ నిలబెట్టడం, పెంపొందించడం హక్కుల ఉద్యమం తన కర్తవ్యంగా పెట్టుకుంటుంది. ఒక్కొక్క ప్రజాతంత్ర కృషి నుండి పుట్టే ప్రమాణాలనూ వ్యవస్థితమయ్యే నియమాలనూ కాపాడడం, విస్తృత పరచడం తన కర్తవ్యంగా పెట్టుకుంటుంది.

సమాజ పురోగమనానికి పోరాటాలూ ఉద్యమాలూ చాలా ముఖ్యం. కానీ వాటిలోని పోరాటం అనే అంశం కంటే దాని ఫలితంగా పుట్టే నూతన విలువల సక్రమవ్యవస్థీకరణ, వ్యాప్తి, వ్యవస్థీకృతమైన విలువల అమలు, దానిని ఆధారం చేసుకున్న ప్రజాతంత్ర కృషి హక్కుల ఉద్యమానికి ముఖ్యం. అందుకే ఆ కోణం నుండే పోరాటాలను కూడా హక్కుల ఉద్యమం విమర్శించగలుగుతుంది. పోరాటాలు చేసే స్థితిలో లేని వారి హక్కుల రక్షణ కోసం ఏమైనా చేయాలన్నా అది వ్యవస్థితమయిన విలువలను అమలు చేయించే కృషిద్వారానే చేయగలం. న్యాయవ్యవస్థతోనూ, చట్టంలోనూ రాజ్యంలోనూ ఉన్న హక్కుల అంశతోనూ, ప్రజాతంత్ర అంశతోనూ హక్కుల ఉద్యమానికి ఉండే సంబంధాన్ని ఈ కృషి నిర్ణయిస్తుంది.

ఈ నాలుగు వాక్యాలలో హక్కుల ఉద్యమానికి సంబంధించిన అన్ని సమస్యలకూ జవాబు దొరికిపోతుందని మా అభిమతం కాదు. నిజానికి హక్కుల ఉద్యమానికి సంబంధించిన అన్ని సమస్యల గురించి ఏకాభిప్రాయం ఎప్పటికీ సాధ్యం కాకపోవచ్చు కూడా. ఒక్కొక్క విషయంలో కృషి చేసినకొద్దీ, ఒక్కొక్క విషయం గురించి ఆలోచించిన కొద్దీ కొంత స్పష్టత ఏర్పడవచ్చు.

మానవహక్కుల వేదిక అనే సంస్థ ఏర్పడిందని తెలియగానే మేము ఏం చేయదలచుకున్నామో ఏ దృక్పథంతో చేయదలచుకున్నామో చెప్పేదాకా, చేసే దాకా ఆగకుండా చాలా మంది 'మానవహక్కులు' అనే పేరుకు తమ బుద్ధికి తోచిన వ్యాఖ్యానాలిచ్చి మా మీద తీర్పు యిచ్చేశారు. మానవ హక్కులు అనే భావన శ్రమదోపిడీని చూడజాలదని ఒకరు, మానవహక్కులంటే అమెరికా ఇరాక్‌పైన చేసిన దాడిని సమర్థించడమేనని ఇంకొకరు, మానవహక్కుల గురించి మాట్లాడుతున్నామంటే ఉన్నవాళ్లూ లేనివాళ్లూ పీడకులూ పీడితులూ అనే తేడా లేకుండా అందరినీ ఒకటిగా చూడబోతామని మరొకరు వ్యాఖ్యానించేశారు. మానవహక్కుల వేదిక ఏర్పడడం దురదృష్టకరమైన పరిణామం అని ఒక హక్కుల సంఘం అధికారికంగా ప్రకటిస్తే, మానవహక్కుల పేరుతో స్వచ్ఛంద సేవా సంస్థలు తమ వ్యాపారాన్ని ముమ్మరంగా సాగిస్తున్న నేపథ్యంలో మానవహక్కుల వేదిక ఆవిర్భావాన్ని అర్థం చేసుకోవాలని మరొక హక్కుల సంఘం అధికారికంగా వ్యాఖ్యానించింది.

ఈ వ్యాఖ్యలకు మేము విడిగా జవాబు చెప్పదలచుకోలేదు. మేము చేసేపని, చెప్పే విషయాలు వీటికి జవాబు చెప్తాయి. ఈ బులెటిన్ కొంతవరకు చెప్తుంది. కానీ ఇదే మా ఆఖరిమాట కాదు. ఏ ఒక్క సమస్య దగ్గరా ఆగిపోని, ఏ ఒక్క ప్రగతిశీల రాజకీయ దృక్పథానికీ పరిమితంకాని, ఏ ఒక్క రాజకీయ ఉద్యమానికీ నిబద్ధం కాని విశాలప్రాతిపదిక గల హక్కుల ఉద్యమం నిర్మించే దిశగా మానవహక్కుల వేదిక ఎదుగుతుంది. మేము

ప్రతిపాదించదలచుకున్న దృక్పథం కూడా దానితోపాటు ఎదుగుతుంది.

మా దృక్పథాన్ని ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో వ్యక్తం చేసే ఈ సంకలనాన్ని మా మొదటి బులెటిన్‌గా మీ ముందుంచుతున్నాం.

రాజీవ్‌గాంధీ హత్యకేసులో సుప్రీంకోర్టు నలుగురికి ఉరిశిక్ష ఖాయం చేయడం, దానిపైన రాష్ట్రపతికి దేశవ్యాప్తంగా క్షమాభిక్ష పిటిషన్లు పంపించడం ప్రస్తుతం వార్తలలో వున్న విషయం. ఈ ఉరిశిక్ష చట్టం ప్రకారం సహేతుకంగానే వేసినా, మరణదండనను సూత్రప్రాయంగా వ్యతిరేకించే వారు, శ్రీలంక తమిళ 'ఈలం' పోరాటం పట్ల బలమైన రాజకీయ పక్షపాతం ఉన్నవారు రాష్ట్రపతిని క్షమాభిక్ష కోరేవాళ్లే. కానీ ఈ తీర్పు చట్టం ప్రకారం కూడా ఎలా అహేతుకమైనదో, అన్యాయమైనదో కె. బాలగోపాల్ తన వ్యాసంలో వివరించారు.

ఎల్‌టిఆర్ చట్టాన్ని ('1/70'ని) ఎట్లాగయినా సవరించాలని మన రాష్ట్రంలోని ప్రజాప్రతినిధులు చాలాకాలంగా ఉబలాటపడుతున్న సంగతి తెలిసిందే. లేటెస్ట్ ప్రయత్నంగా శాసనసభా కమిటీ ఒక నివేదికను రూపొందించి స్పీకర్‌కు సమర్పించింది. అందులోని నిర్దిష్టమైన ప్రతిపాదనల సంగతి అటుంచి, కనీసం నిష్పాక్షికంగా కనిపించాలన్న ప్రయత్నం సహితం ఈ 'ప్రజాప్రతినిధులు' చేయాలనుకోకపోవడం చాలా ఆశ్చర్యం కలిగించే విషయం. వాళ్ల దృష్టిలో ప్రజలంటే ఆదివాసేతరులేనని వారి వైఖరిని బట్టే అర్థం అవుతోంది. ఈ నివేదికలోని సూచనలనూ, దీనికి నేపథ్యమైన పశ్చిమగోదావరి ఏజెన్సీ ఆదివాసీ ఉద్యమాన్నీ పరిశీలించే వ్యాసం ఈ బులెటిన్‌లో ప్రచురిస్తున్నాం.

ఈమధ్య కాలంలో మన రాష్ట్రాన్ని కుదిపివేసిన ఘోరమైన ఘటన ఆదివాసీ ప్రాంతాలలో పెద్ద ఎత్తున జరిగిన అతిసారం, మలేరియా చావులు. 1998లో ఆదిలాబాద్‌లో 2000 మంది దాకా అతిసారం వల్ల చనిపోయారని అంచనా. వారిలో అత్యధికులు ఆదివాసులుకాగా, ఈ సంవత్సరం విశాఖపట్నంలో దాదాపు అంతే సంఖ్యలో చనిపోయిన వారంతా ఆదివాసులే. ఈ చావులు ఏజెన్సీలోని వైద్యవ్యవస్థతో ముడిపడి ఉన్నాయి కాబట్టి ఆ వ్యవస్థపైన బలమైన విమర్శ పెట్టిన సుజాతారావుగారి వ్యాసాన్ని ఈ బులెటిన్లో ప్రచురిస్తున్నాం. ఆమె కొంతకాలం రాష్ట్ర ప్రభుత్వ వైద్య శాఖ ప్రధాన కార్యదర్శిగా ఉన్నారు కాబట్టి 'లోపలి వ్యక్తి'గా ఉన్న విషయ పరిజ్ఞానంతో ఈ వ్యాసం రాశారు.

భారత సుప్రీంకోర్టు రాజ్యాంగంలోని ఆర్టికల్స్ 14, 21కు విస్తృత వ్యాఖ్యానం ఇచ్చి అనేక విషయాలను చట్టపరమైన హక్కుల పరిధిలోకి తీసుకొచ్చిందిగానీ ఒక్క విషయానికి మాత్రం ఆ వ్యాఖ్యానాలను వర్తింపజేయదు. అది, మతాచారాల నుండి పుట్టిన 'పర్సనల్ లా'లో స్త్రీల హక్కుల పరిస్థితి. ఈ విషయంలో సుప్రీంకోర్టు అనుసరిస్తున్న ద్వంద్వ ప్రమాణాలను సవివరంగా విమర్శించేది బి. చంద్రశేఖర్ వ్యాసం.

పోలీసు లాకప్పులోకయినా ప్రపంచం అప్పుడప్పుడు తొంగి చూస్తుందిగానీ జైళ్లలోకి చూడదు. అది మనకు కనిపించని ప్రపంచం. మనకేకాదు, చట్టానికీ రాజ్యాంగానికీ కూడా కనిపించని ప్రపంచం. అధికారం విచ్చలవిడిగా చలాయించే పరిస్థితి ఉండడం ప్రజాస్వామ్య మూల సూత్రాలకే భంగకరం. కానీ జైలు లోపల ఉండే పరిస్థితి అదే. అయినప్పటికీ ఖైదీలు సాహసం చేసి ఆందోళన చేసినప్పుడు మాత్రం ఆ తలుపులు కొంచెం తెరుచుకుని, లోపలి చీకటి ప్రపంచాన్ని మనకు చూపిస్తాయి. ఆ దృశ్యాన్ని విశ్లేషించేది కె. మురళి వ్యాసం.

'ఎన్‌కౌంటర్' అనేది మన రాష్ట్రంలో 30 ఏళ్లుగా ఒక ముఖ్యమైన హక్కుల సమస్యగా ఉంది. ఈ రోజు మన రాష్ట్రంలోనే కాదు, దేశంలోనే ఒక ముఖ్య సమస్యగా తయారయింది. మిలిటెంట్ రాజకీయ శక్తులను ఎదుర్కొనే వికృతమైన ప్రభుత్వ పాలసీగా మొదలయి ఇప్పుడు సాధారణ పాలనా సంస్కృతిలో భాగమయింది. విచిత్రమేమిటంటే ఇది జరుగుతున్న కాలంలోనే భారత సుప్రీంకోర్టు ఆర్టికల్ 21 లోని జీవించే హక్కుకు విస్తృతమైన వ్యాఖ్యానం అంచలంచలుగా ఇచ్చింది. ఇప్పటికీ ఇస్తున్నది. ఎన్‌కౌంటర్‌ల విధానం పోలీస్ సంస్కృతిలో భాగమయిపోవడాన్ని గురించి మాత్రం సుప్రీంకోర్టుగానీ, ఇదే దశలో ఏర్పడిన జాతీయ మానవహక్కుల కమిషన్‌గానీ ఏమీ చేయలేకపోతున్నాయి. కె. బాలగోపాల్ వ్యాసం ఈ విషయాన్ని పరిశీలించింది.

చంద్రబాబు నాయుడు తిరిగి అధికారంలోకి రావడంతో అతని 'విజన్' మరింత ఉత్సాహంగా అమలయ్యే ప్రమాదం ఉంది. తనను తాను ప్రజల ఆకాంక్షలకు ప్రతినిధిగాకాక రాష్ట్ర ప్రభుత్వ వ్యవహారాల నిర్వహణాధికారిగా మాత్రమే చూసుకోవాలని ఇష్టపడి ఆ విషయం పదేపదే చెప్పుకున్నప్పటికీ గెలవగలిగాడంటే తన ప్రాపంచిక దృక్పథానికి వాస్తవ రూపం ఇవ్వడంలో అతను మరింత సాహసం ప్రదర్శించగలడు. కాబట్టి ఆ ప్రాపంచిక దృక్పథం ఎటువంటిదో మరొకసారి దర్శించుకోవడం అవసరం. ప్రొఫెసర్ డి. నరసింహారెడ్డి వ్యాసం ఆ పని చేస్తుంది .

మన రాష్ట్ర ప్రభుత్వం దళితుపైన దాడులు, వివక్ష, అణచివేత పరిస్థితులను సమీక్షించి వాటిని నివారించేందుకు సూచనలిమ్మని జస్టిస్ పున్నయ్య కమిషన్‌ను నియమించింది. ఆయన వివిధ జిల్లాలు పర్యటిస్తూ దళితుల నుండి, దళిత సంఘాల నుండి, ఇతర ప్రజాతంత్ర ఉద్యమ సంస్థల నుండి ఫిర్యాదులు స్వీకరిస్తున్న సంగతి తెలిసిందే. మానవహక్కుల వేదిక కూడా జస్టిస్ పున్నయ్యగారికి కొన్ని సూచనలు సమర్పించింది. ఆ సూచనలను కూడా దీనిలో ప్రచురిస్తున్నాం. దాంతోపాటు మన రాష్ట్రంలో దళితుల మీద జరిగిన దాడుల సంక్షిప్త జాబితాను అనుబంధంగా ఇస్తున్నాం. దళిత మానవహక్కుల సంస్థ 'సాక్షి' సంకలనం చేసిన జాబితా ఇది.

అనేక దేశాలలోని అనేక హక్కుల సమస్యలపైన విశ్లేషణాత్మకమైన నివేదికలు ప్రచురించిన హ్యూమన్ రైట్స్ వాచ్ భారతదేశంలోని దళితుల హక్కుల సమస్యపైన 'బ్రోకెన్ పీపుల్' అనే పేరుతో నివేదిక ప్రచురించింది. అందులో మన రాష్ట్రం గురించి ఉన్న చర్చ స్వల్పమే అయినా బీహార్, తమిళనాడు మొదలయిన రాష్ట్రాల పరిస్థితి గురించి వివరమైన సమాచారం వుంది. ఆ నివేదిక పైన కె. సత్యనారాయణ రాసిన సమీక్ష దీనిలో ఉంది.

ఇవికాక ఈ సంవత్సర కాలంలో మేము ప్రచురించిన కరపత్రాలలో ముఖ్యమైనవి, ఎన్నికలకు సంబంధించిన ఒక రిపోర్టు, లైంగిక వేధింపులకు సంబంధించి సుప్రీంకోర్టు జారీ చేసిన మార్గదర్శకసూత్రాల అమలుపై మరొక రిపోర్టు కూడా ప్రచురిస్తున్నాం.

ఈ బులెటిన్ పైన మీ సలహాలూ సూచనలూ విమర్శలూ మాకు తెలియజేస్తే మా అభివృద్ధికి అది ఉపయోగపడుతుంది.

మానవహక్కుల వేదిక

*28 నవంబర్ 99*